సాక్షి నిజామాబాద్

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఎస్సారెస్పీలో ఇంటి దొంగలు

ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన పాత సామగ్రి నిత్యం చోరీకి గురవుతోంది.

- 8లో ▸



యంత్రంతో సాగు..

అధునాతన వ్యవసాయ యంత్రాల వినియోగంతో పంటల సాగు తీరు రోజురోజుకూ మారిపోతోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.3 /22.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఉంటుంది. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రైలు పొడిగింపు

ఖలీల్‌వాడి/బోధన్ టౌన్ : కరీంనగర్, నిజామాబాద్ ప్యాసింజర్ రైలును బోధన్ వరకు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో శనివారం జెండా ఊపి ప్రారంభించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బోధన్ వరకు పొడిగించబడిన డైలీ ప్యాసింజర్ ట్రైన్ ఈనెల 9 నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ముందస్తు రిజర్వేషన్‌ను రైల్వే అధికారులు ప్రారంభించారు. బోధన్ ప్రజలకు ప్రస్తుతం బోధన్, కరీంనగర్ మధ్యలో ప్రయాణించే వీలుగా రైలు సౌకర్యం ఏర్పడింది.

ఈ నెల 14 నుంచి బతుకమ్మ వేడుకలు

నిజామాబాద్ సిటీ : ఈనెల 14వ తేదీ నుంచి బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవచ్చని తెలంగాణ గాయత్రి ధార్మిక సేవ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శి ప్రకాష్ శర్మ, అరుణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 9 రోజుల పాటు బతుకమ్మ వేడుకలు, అనంతరం దసరా ఉంటుందని, మొదటిరోజు 14న ఎంగిలి పూల బతుకమ్మ, 5వరోజు 18న అట్ల బతుకమ్మ, తొమ్మిదవ రోజు 22న సద్దుల బతుకమ్మ పండుగ ఉంటుందన్నారు.

నిరుపేదలందరికీ 'గృహలక్ష్మి'



వర్ని : బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి నిరుపేదకు రాజకీయాలకు అతీతంగా గృహ లక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేయిస్తామని స్పీకర్ పోచారం వెల్లడించారు. శనివారం వర్ని మండల కేంద్రంలో రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, చందూర్, మోస్రా మండలాలకు చెందిన 1500 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను స్పీకర్ అందజేశారు. నియోజకవర్గంలో ప్రతి వ్యక్తికి సొంతిల్లు ఉండాలన్న ఉద్దేశంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇచ్చామన్నారు. మిగిలిన కొంతమంది నిరుపేదలకు కూడా గృహలక్ష్మి కింద ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, జెడ్పీటీసీలు, హరిదాసు, భాస్కర్ రెడ్డి, గంగారాం, శంకర్ పటేల్, ఎంపీపీలు తదితరులున్నారు.

జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రద్దు

డొంకేశ్వర్(ఆర్మూర్) : రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని రద్దు చేసినట్లు మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకార సొసైటీ నుంచి వాటాధనాన్ని సేకరించి నూతన జిల్లా సహకార సంఘాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నిజామాబాద్ అర్బన్ : బీసీ స్టడీ సర్కిల్ తరఫున డీఎస్సీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వీడియో క్లాసులు కూడా అందిస్తామన్నారు. ఆన్‌లైన్ మెటీరియల్, వీడియోల ద్వారా టెస్టుల నిర్వహణ కూడా ఉంటుందన్నారు. అర్హులైన వారు ఈనెల 12వ తేదీలోపు సుభాష్‌నగర్‌లోని సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

సేవ చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..

- పదేళ్లుగా అనేక సేవలందిస్తోన్న మంచాల జ్ఞానేందర్ గుప్తా
- మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ జిల్లాల్లో సేవలు
- ఉచిత స్వర్గ రథాలు, ఫ్రీజర్ బాక్స్‌లు
- పేదల అంతిమ సంస్కారాలకు సామగ్రి వితరణ
- 18,118 భగవద్గీతల పంపిణీ
- పక్షులకు ఆహారమందించే 1,900 బాక్సుల పంపిణీ
- మట్టి వినాయక విగ్రహాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు
- వచ్చేనెలలో కాశీలోనూ స్వర్గరథం ప్రారంభానికి సిద్ధం
- బాలికల కోసం న్యాప్‌కిన్స్ తయారీ యూనిట్ స్థాపనకు ప్రణాళిక



స్వర్గరథంతో జ్ఞానేందర్ గుప్తా

సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారు మంచాల జ్ఞానేందర్ గుప్తా.. సమాజానికి, తోటివారికి సేవలు చేసేందుకే తనకు దేవుడు జన్మనిచ్చాడనే విధంగా సేవా కార్యక్రమాల పరంపరను రోజురోజుకూ పెంచుకుంటూ పోతున్నారాయన. చాలామంది వ్యాపారంలో లాభాలొస్తే ఆ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తుంటారు.. అయితే అరుదైన వ్యక్తిత్వం కలిగిన జ్ఞానేందర్ గుప్తా మాత్రం వ్యాపారం విస్తరిస్తున్న కొద్దీ తాను చేస్తున్న సేవాకార్యక్రమాల పరిధిని కూడా అంతకంతకూ విస్తరించేందుకు అనుక్షణం తాపత్రయపడుతుండడం విశేషం.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే మంచాల జ్ఞానేందర్ గుప్తా సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తిలో మంచాల శంకరయ్య గుప్తా, భాగ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. 3వ తరగతి వరకు అక్కడే చదివిన జ్ఞానేందర్ గుప్తా పేదరికం కారణంగా లక్సెట్టిపేటలోని తన మేనమామ వద్ద 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివారు. మొదట్లో దుకాణంలో గుమస్తాగా పనిచేసిన జ్ఞానేందర్ పౌల్ట్రీ రంగంలోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగారు. ఈ క్రమంలో 2012లో అయ్యప్ప దర్శనం కోసం శబరిమలై వెళ్తున్న సమయంలో బెంగళూరు వద్ద ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు చందాలు వేసుకున్న ఘటన చూసిన జ్ఞానేందర్ 2013 అక్టోబర్ 19న ఉచిత స్వర్గరథ సేవలకు నిజామాబాద్‌లో శ్రీకారం చుట్టారు. తన తండ్రి మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో సేవలు ప్రారంభించారు. తర్వాత సొంతూరు కనగర్తి, సిరిసిల్ల, వేములవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్, బోధన్, బాన్సువాడల్లో స్వర్గరథాలు ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నారు. తర్వాత 2015 ఏప్రిల్ 11 నుంచి ఫ్రీజర్ బాక్సులను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. మరణించిన వ్యక్తి కుటుంబం పేదదైతే 50 మందికి భోజనాలు, అంతిమ సంస్కార సామగ్రి అందిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు 18,118 మంది అంతిమ యాత్రలకు స్వర్గరథాలు అందించారు.



నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ అవార్డు అందుకుంటున్న మంచాల జ్ఞానేందర్ గుప్తా



భార్య ఇద్దరు కుమార్తెలతో..



గవర్నర్ తమిళిసైకి భగవద్గీత అందిస్తూ..

- 2014 నుంచి ఆ గ్రంథాలను ఉచితంగా పంచుతున్నారు. ఇప్పటివరకు తెలుగు, హిందీ, ఆంగ్లం, మరాఠా భాషలకు చెందిన 4,730 భగవద్గీతలను పంపిణీ చేశారు. వీటిని అందుకున్నవారిలో అంతర్జాతీయ, జాతీయ ప్రముఖులున్నారు. ప్రధాని మోదీ స్ఫూర్తితో వీటిని అందిస్తున్నారు. వందల సంఖ్యలో రామకోటి పుస్తకాలను కూడా పంచిపెట్టారు.
- 2013 నుంచి ప్రతి ఏటా పర్యావరణ పరిరక్షణలో భాగంగా 700 వినాయక మట్టి ప్రతిమలను నిజామాబాద్‌లో పంచుతున్నారు. 2019 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా డ్రిల్లింగ్ యంత్రాలు ఏర్పాటు చేసుకున్నారు. 35 వేల మొక్కలు నాటించారు.
- 2020 నుంచి తన చిన్న కుమార్తె హారిణి కోరిక మేరకు పక్షులకు ఆహారం అందించేందుకు 1,900 బాక్సులను ఉచితంగా పంపిణీ చేశారు.
- 2020 నుంచి అయ్యప్ప స్వామి పడిపూజకు ఉచితంగా మండపాలు వేయిస్తూ ఉన్నారు. ఇప్పటిదాకా 100కు పైగా మండపాలు వేయించారు.

సండే స్పెషల్

- జన్నేపల్లి గ్రామానికి నీళ్ల ట్యాంకులు ఇచ్చారు. నీటిఎద్దడి ప్రాంతాల్లో గత ఆరేళ్లుగా ప్రతి వేసవిలో రోజుకు 1లక్ష లీటర్ల నీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు.
- ఉత్తరప్రదేశ్‌లోని కాశీలో వచ్చే నెలలో స్వర్గరథం ప్రారంభించనున్నారు. ఇప్పటికే వాహనం కొనుగోలు చేశారు. యూపీ సీఎం యోగి చేతులమీదుగా ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారు.
- డాక్టరైన తన పెద్ద కుమార్తె శరణ్య ఆలోచన మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు నెలసరి ప్యాడ్లు ఉచితంగా పంపిణీ చేసేందుకు త్వరలో తయారీ ప్లాంట్‌ను నిజామాబాద్‌లో నెలకొల్పేందుకు ప్రణాళిక వేస్తున్నారు.
- ఇక తన వ్యాపారాల ద్వారా 100 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు.మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్‌కు ఐఎస్‌వో 9001–2015 అవార్డు దక్కింది.
- ఉత్తమ వ్యాపారవేత్తగా దుబాయ్, ఇండోనేషియా నుంచి కూడా అవార్డులు పొందారు.



కాలిఫోర్నియా బర్కిలీ వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న మంచాల జ్ఞానేందర్ గుప్తా

300కు పైగా అవార్డులు.. మోదీ ప్రశంసలు

జ్ఞానేందర్ గుప్తా మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో చేస్తున్న సేవలకు గాను జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఇప్పటివరకు 300కు పైగా అవార్డులు, ప్రశంసలు వచ్చాయి. లిమ్కా బుక్‌లో స్థానం సాధించారు. యూఎస్ఏలో ని కాలిఫోర్నియా బర్కిలీ వర్సిటీ నుంచి సేవలకు గాను డాక్టరేట్ పొందారు. భగవద్గీత పంపిణీకి గాను ప్రధాని మోదీ నుంచి ప్రశంస లందుకున్నారు.



జీవిత భాగస్వామి సహకారంతో..

వ్యాపారంలో, ఇటు సేవా కార్యక్రమాల నిర్వహణలో నా సతీమణి శ్రీలక్ష్మి పూర్తి సహకారం ఉంది. అదేవిధంగా మా ఇద్దరు కుమార్తెలు మరింతగా ప్రోత్సహిస్తున్నారు. భగవద్గీతను చదివితే ప్రతి వ్యక్తి ఏవిధంగా నడుచుకోవాలో తెలుస్తుంది. ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలి. నా గుండె కొట్టుకునేవరకు భగవద్గీత గ్రంథాలు పంచుతూనే ఉంటాను. సేవాకార్యక్రమాలను మరింతగా విస్తరించుకుంటూ ముందుకు వెళ్తాను. తుదిశ్వాస వరకు సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పయనిస్తాను. – మంచాల జ్ఞానేందర్‌గుప్తా

సంకల్పబలంతో అనుకున్నది సాధ్యం

- యువతకు అండగా ఎంపీఆర్ ఫౌండేషన్
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఫౌండేషన్ చైర్మన్ మేడపాటి ప్రకాశ్‌రెడ్డి
- వందలాదిగా తరలివచ్చిన యువత
- ఎడపల్లిలో మెగాజాబ్ మేళా సక్సెస్



జాబ్‌మేళాలో నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మేడపాటి ప్రకాష్‌రెడ్డి



మెగా జాబ్ మేళాలో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న నిరుద్యోగులు

బోధన్/ఎడపల్లి: సంకల్పబలంతో అనుకున్నది సాధ్యమని, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఎంపీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి యువతకు సూచించారు. ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం మెగాజాబ్‌మేళా నిర్వహించారు. ముందుగా మేడపాటి ప్రకాశ్‌రెడ్డి తన సతీమణి శ్రీదేవి, కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ ముఖ్యనాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, సుధాకర్‌చారి, బాల్‌రాజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకోసం జాబ్‌మేళా ఏర్పాటు చేయాలని సంకల్పించామని, ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజనను నిరుద్యోగ యువత సద్వినియోగం చే సుకునేలా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తా మన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ప్రముఖ కంపెనీల ప్రతిని ధులు హాజరయ్యారు. 1600 మందికి పైగా యువతీ యువకులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఉద్యోగాలు సాధించిన వారికి నియామకపత్రాలు అందజేశారు. అందరికీ భోజనం ఏర్పాటు చేశారు. ప్రతినిధులు శ్రీధర్, సరిన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చందర్, డాక్టర్ విజయ రఘు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సహనం ఎంతో అవసరం



అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే సహనం ఎంతో అవసరం. నేటి విశాలమైన మార్కెట్‌లో విభిన్న రంగాల్లోని పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. యువత తాము ఎంచుకున్న రంగంలో పూర్తి నైపుణ్యంతో రాణించాలి.

– మేడపాటి హర్షవర్ధన్, ఫౌండేషన్ మెంబర్

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జాబ్‌మేళాకు యువతులు పెద్దసంఖ్యలో హాజరు కావడం సంతోషకరం. యువతులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అన్నిరంగాల్లో ఉన్నతస్థాయికి చేరాలి. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం ఆనందంగా ఉంది.

– మేడపాటి శ్రీదేవి, ఎంపీఆర్ ఫౌండేషన్ సభ్యురాలు

ప్రయత్నం ఆపొద్దు



లక్ష్య సాధనలో ప్రయత్నాన్ని ఎన్నడూ ఆపొద్దు. జాబ్ మేళాకు 25కు పైగా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చాయి. వచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకోవద్దు. జాతీయ స్థాయి నెట్ వర్క్ ఉన్న అనేక ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి.

– విష్ణువర్ధన్ రెడ్డి, ఫౌండేషన్ మెంబర్

ఇంటికో ఉద్యోగమని కేసీఆర్ మోసం



ఇంటికో ఉద్యోగమిస్తామని హామీ ఇచ్చి సీఎం కేసీఆర్ నిరుద్యోగ యువతను మోసం చేశాడు. తెలంగాణను నిరుద్యోగ రాష్ట్రంగా మార్చాడు. నిరుద్యోగుల కోసం ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు అభినందనీయం.

– వడ్డి మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

న్యాయసేవాధికార సంస్థ సేవలు భేష్



ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పగా ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తులు పి.శామ్ కోషీ, సి.సుమలత అభినందించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మాడ్యుల్ క్యాంప్ నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు శామ్ కోషీ, సుమలత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టరేట్ వద్ద హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా జడ్జి కె.సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి స్వాగతం పలికారు. శామ్ కోషీ మాట్లాడుతూ ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, మరో ఇద్దరు బాధిత మహిళలకు ఉద్యోగాలివ్వడం భేష్ అన్నారు. హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి సుమలత మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డీ ఎల్ఎస్ఏ ప్రతినిధులను అభినందించారు. జిల్లా జడ్జి కె.సునీత మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ల ద్వారా 38,497 కేసులను పరిష్కరించామన్నారు.

రంగంలోకి రామన్న!

- కామారెడ్డిలో కేసీఆర్ గెలుపు కోసం ప్రయత్నాలు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- అందరినీ కలుపుకుని వెళ్లాలని హితవు



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై ఎంపీ బీబీ పాటిల్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి : బీఆర్ఎస్ కామారెడ్డి అభ్యర్థి గా సీఎం కేసీఆర్‌ను ప్రకటించడంతో ఆ పార్టీలో ఉత్సాహం కనిపించింది. అయితే నేతల మధ్య విభేదాలుండడంతో వారిని సమన్వయం చేసేందుకు మంత్రి కేటీఆర్ చొరవ చూపుతారని శ్రేణులు ఆశించాయి. కానీ అభ్యర్థిని ప్రకటించి నెల రోజులైనా ఎలాంటి సమావేశాలు లేకపోవడంతో స్తబ్దత ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. శనివారం కామారెడ్డిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. దీంతో క్యాడర్‌లో మళ్లీ జోష్ వచ్చింది.

ఇన్‌చార్జీలుగా ముగ్గురు..

కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జి ఎవరన్న విషయంపై మంత్రి కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. తనతోపాటు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇన్‌చార్జీలుగా ఉంటారన్నారు. నియోజకవర్గంలో 266 పోలింగ్ బూత్‌లు ఉండగా.. ప్రతి బూత్‌కు ఒక సీనియర్ నేతకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. నేతలు విభేదాలను పక్కనపెట్టి, కేసీఆర్‌కు రికార్డు స్థాయి మెజారిటీ అందించేందుకు కృషి చేయాలన్నారు. గంప గోవర్ధన్‌ను కేటీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. 2009లో గంప ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని, ఉప ఎన్నికల్లో ఆయనను గెలిపించుకున్నామని, అప్పటి నుంచి ఆయన విజయాన్ని ఎవరూ ఆపలేకపోయారని పేర్కొన్నారు. కామారెడ్డి మరింత అభివృద్ధి చెందాలన్న తపనతో ఆయన సీఎంను ఇక్కడికి ఆహ్వానించారన్నారు. కేసీఆర్ గెలుపుకోసం తాను కార్యకర్తలా పనిచేస్తానని చెప్పిన గొప్ప వ్యక్తి అంటూ గంపను పొగిడారు. గంపకు ఎమ్మెల్యే పదవికంటే మంచి గుర్తింపు వస్తుందన్నారు.

బయటపడ్డ విభేదాలు..



బీఆర్ఎస్‌లో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. శనివారం పట్టణంలో పార్టీ సమావేశం నేపథ్యంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, ఆమె కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఫొటో లేకపోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలం క్రితం విప్‌తో చైర్మన్‌కు, ఆమె కుటుంబ సభ్యులకు విభేదాలు తలెత్తాయి. దీంతో పట్టణంలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ పాల్గొనడం లేదు.

క్లుప్తంగా

జీవో నంబర్ 46ను రద్దు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి జీవో నంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ డిమాండ్ చేశారు. తెయూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం శనివారం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో అవకతవకలు జరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీశైలం, మహేశ్, అభినయ్, విజయకుమార్, రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్ కుమార్, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ నూతన కమిటీ నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఎన్ఎస్‌యూఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ శనివారం తెలిపారు. క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కమిటీని ఎంపిక చేసిన వారికి నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా నియామకమైన కమిటీ యూనివర్సిటీ సమస్యలపై పోరాడాలని సూచించారు. అనంతరం వర్సిటీ నుంచి కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన పలువురు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కొమిరే శ్రీశైలం, అభినయ్, మహేశ్, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, రాజేందర్, శ్రీకాంత్, రమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జీనత్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధక విద్యార్థిని జీనత్ సుమైరా పీహెచ్‌డీ డాక్టరేట్ శనివారం సాధించారు. తెయూ ఎంబీఏ హెచ్‌వోడీ ప్రొఫెసర్ అపర్ణ పర్యవేక్షణలో 'కెమెల్ మోడల్‌ను ఉపయోగించి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఆర్థిక పనితీరుపై సేవా నాణ్యత ప్రభావం-అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం సుమైరాను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఖైసర్ మహమ్మద్, రాజేశ్వరి, వాణి, కిరణ్‌కుమార్ రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో పోలీసులది కీలక పాత్ర



బోధన్‌టౌన్(బోధన్): నేర పరిశోధనలో పోలీసులది కీలక పాత్ర అని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య అన్నారు. బోధన్ కోర్టులో పోలీసులకు ఇన్వెస్టిగేషన్ ప్రొసీజర్ గురించి శనివారం అవగాహన కల్పించారు. కేసు దర్యాప్తులో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సదస్సులో ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్, ఎస్సై బాలయ్య, బాల్ సింగ్, కోర్టు పీసీలు ఉన్నారు.

యంత్రంతో సాగు.. లాభాలు బాగు

- నూతన పద్ధతితో అధిక దిగుబడులు
- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందుల పిచికారీ



రసాయనాలు పిచికారీ చేసే యంత్రం



పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతులు

నిజామాబాద్ రూరల్: అధునాతన వ్యవసాయ యంత్రాల వినియోగంతో పంటల సాగు తీరు క్రమంగా మారుతోంది. కూలీల కొరత పెరుగుతున్నందున నవీన యంత్రాల కొనుగోలుకు, వినియోగానికి పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నూతన టెక్నాలజీని వినియోగించి రైతులు తమ పంటలపై ప్రత్యే శ్రద్ధ కనబరుస్తూ అధిక దిగుబడి సాధిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో పంట పండించాలంటే నాగలి, ఎద్దులు, నాటు వేసేందుకు, కలుపు తీసేందుకు, పంట కోసేందుకు కూలీల అవసరం ఉండేది. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన వ్యవసాయ యంత్రాల వినియోగంతో పంటలసాగుపై రైతులు ప్రత్యేక దృష్టిని కనబరుస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేసేందుకు, కలుపు తీసేందుకు, పంటకు పిచికారీ చేసేందుకు అధునాతన యంత్రాలను ఉపయోగిస్తూ లాభాలు పొందుతున్నారు. దీంతో పాటు కూలీల కొరత లేకుండానే పంట సాగు సులభతరమవుతోంది. వేసిన పంట కోసేందుకు హార్వెస్టర్ మిషన్లను ఉపయోగిస్తూ పది రోజుల్లో జరగాల్సిన పనులు తొందరగ పూర్తవుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వరి పంట పొట్ట దశలో ఉంది. వాతావరణ మార్పుల్లో భాగంగా పంట తాలు, తప్ప పోకుండా ట్రాక్టర్ ద్వారా ఎలాంటి మందునైనా పంటకు పిచికారీ చేసేందుకు నూతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ట్రాక్టర్ వెనుక భాగంలో ఉన్న 600 లీటర్ల డ్రమ్ములో వరి పంటకు ఏ మందు పిచికారి చేయాలో రైతులు నిర్ణయించుకొని డ్రమ్ములో మందు కలుపుకొని దాదాపు 5 ఎకరాల వరకు వచ్చే పైపు ద్వారా రైతులు సునాయాసంగా వరి పైరు పై రసాయన ఎరువులు పిచికారీ చేయొచ్చు. గతంలో చిన్న కారు రైతులు 30 లీటర్ల పవర్ పంపును భుజాన వేసుకుని పిచికారీ చేస్తే 5 ఎకరాలకు రెండు రోజుల సమయం పట్టేది. కానీ నూతన యంత్రంతో ఒకేరోజు 15 ఎకరాలు వరి పైరుకు పిచికారీ చేయొచ్చు. ట్రాక్టర్ యంత్రం ద్వారా పిచికారీ చేస్తే గంటకు రూ. 400 ట్రాక్టర్ యజమాని తీసుకుంటాడు. కూలీలైతే నాలుగైదు రోజుల సమయం వృథాతో పాటు రోజుకు రూ. 600 కూలి చెల్లించాల్సి వస్తుంది. నూతన వ్యవసాయ యంత్రాల సాగును వినియోగించి రైతులు తక్కువ ఖర్చుతో పంట సాగు చేస్తూ దిగుబడి పొందుతున్నారు.

యంత్రంతో ఎంతో మేలు

గతంలో చేతిపంపుతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తాను నూతన యంత్రాన్ని కొనుగోలు చేసి ట్రాక్టర్ సహాయంతో రైతులకు సమయాన్ని ఆదా చేయడంతో పాటు డబ్బులు మిగులుతోంది. సుమారు 20 ఎకరాల ఉన్న రైతులకు సైతం ట్రాక్టర్ ద్వారా పిచికారీ చేయొచ్చు.

–పత్తి శివయ్య, రైతు

డబ్బు ఆదా అవుతోంది

నాకున్న ఆరు ఎకరాల పంటపై ట్రాక్టర్ సహాయంతో మందులను పిచి కారీ చేశాను. సమయంతో పాటు డబ్బు ఆదా అవుతోంది. గతంలో డ్రోన్‌ల ద్వారా రసాయన ఎరువులను పిచికారీ చేశాం. దానికి రెట్టింపు ఖర్చు అయ్యేది. ఈ ట్రాక్టర్ యంత్రంతో డబ్బు ఆదాతోపాటు సమయం వృథా కావడం లేదు.

–క్యాసారపు నారాయణరెడ్డి, రైతు

ఎస్సారెస్పీలో 'ఇంటి' దొంగలు

- ప్రాజెక్టు అధికారుల కనుసన్నల్లోనే పాత సామగ్రి తరలింపు!
- తాజా ఘటనతో అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు



దొంగిలించిన రోప్‌లతో వెళ్తున్న ఆటో ట్రాలీ



పోచంపాడ్ గోదాంలో నిల్వ ఉంచిన రోప్

బాల్కొండ: ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు పాత సామగ్రి మాయమవుతోంది. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. శుక్రవారం రాత్రి ప్రాజెక్టు దిగువన ఉన్న గోదాం నుంచి పాత రోప్‌ను గుర్తు తెలియని దుండగులు ఆటోలో ఎత్తుకెళ్తుండగా ఆటో గుంతలో కూరుకుపోయింది. దీంతో వారు ట్రాలీని వదిలి వెళ్లిపోయారు. ఉదయం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. కానీ పోచంపాడ్ వద్ద ఉన్న పాత భవనాలు, గోదాముల నుంచి పాత సామాగ్రిని దొంగలు ఎత్తుకెళ్లడం ఇది కొత్త కాదని, ఇదంతా ప్రాజెక్టు అధికారుల కనుసన్నల్లోనే నడుస్తోందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తోంది. ఇది వరకు పాత భవనాలన్నున్న తలుపులు, కిటికీలు, రేకులను ఎత్తుకెళ్లారు. అయినా సంబంధిత అధికారులు ప్రాజెక్టు సామాగ్రి చోరీకి గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం వరద గేట్ల మరమ్మతుల పని కొనసాగుతుండడంతో పాత సామాగ్రి అధికంగా వస్తోంది. పాత రోప్‌లు, రబ్బర్లు, గేట్లను ప్రాజెక్టు దిగువన కాకతీయ కాలువ పక్క ఉన్న గోదాంలో అధికారులు భద్రపరుస్తున్నారు. కానీ వీటికి ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో దుండగులు ఎతుకెళ్తున్నారు.

కొంత కాలంగా ..

ప్రాజెక్ట్ వద్ద కొంత కాలంగా అనేక చోరీలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం ప్రాజెక్టు ప్రాంతంలో రూ. లక్షల విలువ చేసే కలపదందాను కొందరు యథేచ్ఛగా కొనసాగించారు. ఈ ఘటన మరువకముందే గోదాం నుంచి పాత రోప్ వైర్లు ఎత్తుకెళ్లే బాగోతం బయట పడింది. ఈ చోరీలు కొత్తేం కాదని సంబంధిత అధికారుల అండతోనే దుండగులు చోరీకి పాల్పడుతున్నారని స్థానికులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఆటో ట్రాలీ బురదలో కూరుకు పోవడం ఈ బాగోతం బయట పడింది. లేదంటే ఇలానే మరికొన్ని రోజులు దొంగతనాలు జరుగుతూ ప్రాజెక్టు సామాగ్రి మాయమవుతూనే ఉండేది. ప్రాజెక్ట్ కాలనీలో అనేక పాత వాహనాలు ఉన్నాయి. వాటిని టెండర్ నిర్వహించి విక్రయించకపోవడంతో అవితుప్పు పట్టిపోతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చోరీలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గోదాం నుంచి తరచూ జరుగుతున్న చోరీల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. శుక్రవారం రాత్రి జరిగిన చోరీ గురించి పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేశాం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

–చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రోత్సాహం



పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్

రెంజల్(బోధన్): శాఖా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ అన్నారు. ప్రతి గ్రామంలో శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రెంజల్‌లో నూతన గ్రంథాలయ భవణ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యాలయాలతో సమానమన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోలపు రజని, జడ్పీటీసీ విజయ, సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, నాయకులు పాల్గొన్నారు.

అధికారులకు అవగాహన సదస్సు



ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కోర్టులో నిజామాబాద్ డివిజన్ పోలీస్, ఎక్సైజ్ అధికారులకు అదనపు నిజామాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్ గౌడ్ శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేసుల పంచనామా, చార్జిషీట్ రిమాండ్ రిపోర్టులు కోర్టులో దాఖలు చేయు విధానం, నేరస్తులకు శిక్ష పడేలా సాక్ష్యాలు సేకరించి కోర్టులో దాఖలు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. సదస్సులో డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవి రాజ్, రాజారెడ్డి, కవిత రెడ్డి, పోలీస్‌అధికారులు, సర్కిల్‌రైటర్లు పాల్గొన్నారు.

నేడు ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



బోధన్: సిక్కిం వరదల్లో గల్లంతై చనిపోయిన సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ మృతదేహానికి ఆర్మీ అధికారిక లాంఛనాల ప్రకారం ఆదివారం స్వగ్రామంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి సిక్కిం రాష్ట్రంలో సంభవించిన వరదల్లో గల్లంతైన ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ మృతదేహం లభ్యమైంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని జల్‌పాయ్‌గిరి జిల్లా ఆసుపత్రిలో ఆర్మీ అధికారులు పోస్టుమార్టం ప్రక్రియను పూర్తి చేసి మృతదేహాన్ని విమానంలో అక్కడి నుంచి శనివారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఆర్మీ క్యాంప్‌లో ఉంచారు. ఆదివారం తెల్లవారు జామున ఆర్మీ క్యాంప్ నుంచి రోడ్డు మార్గంలో కుమ్మన్‌పల్లికి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్మీ అధికారిక లాంఛనల మేరకు అంత్యక్రియలు జరుగనున్నాయి.

18 మంది కానిస్టేబుళ్ల ఎంపిక

నిజామాబాద్ అర్బన్ : ఎస్సీ స్టడీ సర్కిల్లో కానిస్టేబుల్ శిక్షణ తీసుకున్న అభ్యర్థుల్లో 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శశికళ ఒక ప్రకటన తెలిపారు. సెంటర్‌లో శిక్షణ తీసుకొని ఉద్యోగాలకు ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

యూకే ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌గౌడ్



ఖలీల్‌వాడి: ఇంగ్లండ్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన సుధాకార్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌దళీవాల్‌జీ, ఐఓసీ టీమ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఐఓసీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని అన్నారు.

ఈసీ తీర్మానాలు అమలు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పాలకమండలి చేసిన తీర్మాణాలు కాలాయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జన్నారపు రాజేశ్వర్, వి.సంతోష్, జయంతి, రవీందర్, అక్షయ్ పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకులకు పదోన్నతులు



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు అధ్యాపకులకు శనివారం పదోన్నతులు లభించాయి. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నసీం సీనియర్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్లు సీహెచ్.అంజనేయులు, కె.రవీందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, మూసాఖురేషీలు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు. వీరికి రిజిస్ట్రార్ యాదగిరి పదోన్నతి ఉత్తర్వులు అందజేసి అభినందనలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ రిజిస్ట్రార్, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత ప్రొఫెసర్ యాదగిరిని అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తెయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరిని మెమోంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, కామర్స్ డీన్ జి.రాంబాబు, పీఆర్‌వో పున్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు కొత్త పనులను గుర్తించి, ఎస్టిమేషన్ తయారు చేసి మంజూరు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రలోని ట్రిజం ట్రెనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను గుర్తించి సకాలంలో పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సరైన ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించి ఉపాధి కూలీలకు పని కల్పించకుండా వ్యవహరిస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల ప్రణాళికను నవంబరు నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాకు పండ్ల తోటల పెంపకం కోసం 1,830 ఎకరాల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సంజీవ్, అసిస్టెంట్ పీడీ ఓంపాల్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ గంగాధర్, డీఆర్‌పీ సుశీల్, హెచ్‌ఆర్ మేనేజర్ నర్సింలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పాల్దాలో చెక్ పవర్ వివాదం



విచారణ చేపడుతున్న డీఎల్పీవో నాగరాజు

నిజామాబాద్ రూరల్: పాల్దా జీపీలో చెక్ పవర్ వివాదం చోటు చేసుకోవడంతో డీఎల్పీవో నాగరాజు శుక్రవారం విచారణ చేపట్టారు. సర్పంచ్ భర్త నవీన్ గ్రామంలో చేసిన పనులపై అనుమానాలు ఉండడంతో మూడు నెలలుగా ఉపసర్పంచ్ నరేశ్ చెక్కులపై సంతకాలు చేయడం లేదు. దీంతో సర్పంచ్ సుప్రియానవీన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉపసర్పంచ్ నరేశ్‌కు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా డీఎల్‌పీవో నాగరాజును క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించడంతో జీపీలో విచారణ చేపట్టారు. గ్రామంలో చేపట్టిన పనులపై కొన్ని అనుమానాలు ఉన్నాయని, అవి నివృత్తి అయ్యేవరకు తాను సంతకం చేయనని ఉపసర్పంచ్ నవీన్ తెలుపుతున్నట్లు డీఎల్‌పీవోకు సర్పంచ్ వివరించారు. ఈ వివాదంతో తమ వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జీపీ సిబ్బంది డీఎల్‌పీవోకు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినా ఉపసర్పంచ్ చెక్కులపై సంతకాలు చేయను అనడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. క్యాప్ సర్టిఫికెట్‌పై కూడా ఉపసర్పంచ్ సంతకం చేయకపోవడంతో మూడు నెలలుగా జీపీకి వచ్చే నిధులు ఆగిపోయాయి.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో ఇతిహాస సంకలన సమితి ఇందూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అశ్మక చరిత్ర గ్రంథాలయానికి చరిత్ర పుస్తకాలను జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ శనివారం అందజేశారు. తన తాత స్వర్గీయ బెల్లాల్ మానిక్‌రెడ్డి జయంతి సందర్భంగా చరిత్రాత్మకమైన పుస్తకాలను అందించినట్లు తెలిపారు. అనంతరం అధికారిణి శైలి బెల్లాల్‌ను సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కందకుర్తి ఆనంద్, మోహన్ దాస్, రిషి తదితరులు పాల్గొన్నారు.

నేడు శౌర్య జాగరణ యాత్ర

నిజామాబాద్ సిటీ: యువత పెడదోవ పడకుండా సన్మార్గంలో నడిపించేందుకు నగరంలోని మేరు భవన్‌లో ఆదివారం నిర్వహించే శౌర్య జాగరణ యాత్ర సమావేశంలో యువకులు పాల్గొనాలని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, జిల్లా సహకార్యదర్శి ధాత్రిక రమేశ్ కోరారు. నగరంలోని వినాయక్‌నగర్ అభయ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర ర్యాలీని శనివారం నిర్వహించారు. సమావేశానికి ప్రధాన వక్తగా మహేశ్వర్‌రెడ్డి హాజరవుతారని అన్నారు.

ఆన్‌లైన్‌లో మోసం

బోధన్‌టౌన్(బోధన్): మండలంలోని పెంటకుర్దు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్‌లో రూ.2 లక్షల12 వేలకు మోసపోయినట్లు ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ యువకుడికి సెప్టెంబర్22న సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము పంపిన లింక్ ఓపెన్‌చేస్తే డబ్బులు వస్తాయంటూ నమ్మించారు. మొదటగా విడతల వారీగా యువకుడి బ్యాంక్ అకౌంట్‌కు డబ్బులు పంపించారు. అధిక మొత్తంలో డబ్బులు రావాలంటే తాము చెప్పిన బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు జమ చేయాలంటూ విడతల వారీగా రూ. 2లక్షల12వేలు వేయించుకున్నారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన యువకుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బోధన్‌టౌన్: సాలంపాడ్ క్యాంప్‌కు చెందిన కొండారెడ్డి (58) కుమ్మన్‌పల్లి శివారులో విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొండారెడ్డి తన పొలంతో పాటు కుమ్మన్‌పల్లి శివారులో భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. శనివారం ఉదయం పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన గంగారాం శుక్రవారం తన బైక్‌పై సుద్దపల్లిలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని స్వగ్రామానికి వెళ్తుండగా సుద్దపల్లి శివారులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో గంగారాం తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ఘటనలో పాఠశాల విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. అర్గుల్ నుంచి విద్యార్థులు ఆటోలో జక్రాన్‌పల్లి మోడల్ స్కూల్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

8 మంది బైండోవర్

మోపాల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవార్ చేసినట్లు ఎస్సై రాము శనివారం తెలిపారు. సిర్‌పూర్, రామేశ్వర్‌పూర్ తండా, న్యాల్‌కల్, పలు గ్రామాలకు చెందిన 8 మందిని ఎన్నికల సంఘం సూచనల మేరకు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన ఎర్వ లోకేశ్‌కుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై మురళి శనివారం తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న లోకేశ్‌కుమార్ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదన్నారు. లోకేశ్ తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.48 లక్షలు పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని 1, 2, 3వ టౌన్ పీఎస్ పరిధిల్లో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టగా రూ. 48 లక్షలు పట్టుబడినట్లు ఎస్సైలు తెలిపారు. ఒకటో టౌన్ పీఎస్ పరిధిలోని గంజ్‌కమాన్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా రూ.2.50 లక్షలు, 3వ టౌన్ పీఎస్ పరిధిలో రూ.3.50 లక్షలు, 2వ టౌన్ పీఎస్ పరిధిలోని పెద్దబజార్ చౌరస్తాలో రూ.42 లక్షలు సదరు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పోలీసుల పేరుతో బంగారం టోకరా

ఖలీల్‌వాడి: పోలీసులమని సీపీ వాహనం దాటి వస్తావా అని బాధితుడిని బెదిరించి ఆరున్నర తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ పీఎస్ పరిధిలోని కంఠేశ్వర్‌బైపాస్ వద్ద రోకడి హనుమాన్ సమీపంలో పోలీసులమని సీపీ వాహనం వద్ద ఆపినా ఆపకుండా వస్తున్నావని బెదిరింపులకు దిగాడు. సదరు బాధితుడు మీరెవరని ప్రశ్నించగా పోలీసు అని ఐడెంటీకార్డు తీసి చూయించారు. దీంతో బంగారం తీసి దస్తీలో పెట్టాలని బెదిరించడంతో బాధితుడు తనపై ఉన్న బంగారాన్ని తీసి దస్తీలో పెట్టాడు. అదే సమయంలో మరో బైక్‌పై వచ్చిన వ్యక్తిని సైతం బెదిరించి బ్యాగులో ఏముంది బ్యాగులో ఉన్న డబ్బులను దస్తీలో పెట్టాలని బెదిరించాడు. సీపీ ఆఫీసుకు రావాలని బాధితుడికి చెప్పి డబ్బుల బ్యాగ్‌తో వచ్చిన వ్యక్తితో దొంగ పోలీసు ఉడాయించాడు. దీంతో సదరు బాధితుడు సౌత్ సీఐ కార్యాలయానికి వెళ్లగా జరిగిన విషయాన్ని సీఐ వెంకటనారాయణకు చెప్పాడు. సీఐ వివరాలు తెలుసుకొని సీసీ టీవీఫుటేజీలను పరిశీలించారు. బంగారం ఎత్తుకెళ్లిన వ్యక్తితోపాటు బ్యాగులో డబ్బులు చూయించిన వ్యక్తి ఇద్దరు ఒక్కటేనని పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.